క్లుప్తంగా

ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరుడు



చామంతులతో అలంకరించిన రామలింగేశ్వర స్వామి

సీతంపేట: కార్తీక మాసం ఆఖరి రోజు సందర్భంగా దేవాదాయశాఖ పరిధిలోని రామలింగేశ్వరాలయంలో శివుడు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారిని తెల్ల చామంతులతో చూడ ముచ్చటగా అలంకరించారు. పరిసర ప్రాంత భక్తులుపెద్ద సంఖ్యలో స్వామి దర్శించి అభిషేకాలు, అర్చనలు చేశారు. దీపాలు వెలిగించారు.

హరికథా భాగవతార్‌కు సత్కారం



వేణుమాధవ్ భాగవతార్‌ను సత్కరిస్తున్న గౌరీ సేవా సంఘం సభ్యులు

సీతంపేట: దేవదాయ శాఖ పరిధిలోని శంకర మఠం రోడ్‌లోని రామలింగేశ్వరాల యంలో కార్తీక మాసం నెలరోజులు హరికథా కాలక్షేపం చేసిన వేణుమాధవ్ భాగవతార్‌ను గౌరీ సేవా సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో జి.వి.రమాభాయి, సంఘం సభ్యులు అతికినెట్టి గంగా మహేశ్వరరావు, కాళ్ల సూర్యప్రకాష్, బొడ్డేటి రవికుమార్, కొణతాల గోవింద్, కాళ్ల గోపీ కృష్ణ, పెంటకోట చక్రవర్తి, కార్తీక మాస ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కంచరపాలెం: జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా ఆధ్వర్యంలో ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని అలకంరించి, హారతి పూజలు చేశారు. ఆలయ అర్చకులు శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

ధ్యానంతో ప్రశాంతత


విశాఖ విద్య: నిష్కామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏయూ క్యాంపస్‌లోని డాక్టర్ వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియంలో 'ధ్యానం: నిర్విషయం మనః' అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు అరుణాజీ ప్రసంగిస్తూ ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ధ్యానం ప్రాముఖ్యత, మనసును నియంత్రించడం ధ్యాన సాధనలో ఎంత ముఖ్యమో వివరించారు. ధ్యాన సాధనలో ఎదురయ్యే అవరోధాలు, ధ్యానం చేయడానికి అనుసరించవలసిన విధానాలను తెలియజేశారు. ముఖ్య అతిథి డాక్టర్ పి.వి.సుధాకర్(అనిల్ నీరుకొండ ఎడ్యుకేషన్ సొసైటీ డీన్) నిష్కామ ఫౌండేషన్ నిర్వహిస్తున్న కార్యక్రమాలను ప్రశంసించారు. భగవద్గీత అధ్యయనం ప్రాముఖ్యతను విశదీకరించారు.

వాకర్స్ క్లబ్.. విజ్ఞానం.. వినోదాల హబ్

- మురళీనగర్ వాకర్స్ క్లబ్ మూడు దశాబ్దాల ప్రస్థానం
- ఇండోర్ గేమ్స్‌లో శిక్షణ
- గ్రంథాలయం ఏర్పాటు
- వాకర్స్ ఇంటర్నేషనల్ స్థాయిలో ఐదు అవార్డులు



కలర్ లైటింగ్



వాకర్స్ క్లబ్ సాధించిన అవార్డులు

మురళీనగర్:

మురళీనగర్ వాకర్స్ క్లబ్ నగరంలోనే ప్రసిద్ధి చెందింది. క్లబ్‌ను 1995లో ఏర్పాటు చేశారు. మొదట్లో 21 మంది సభ్యులతో ప్రారంభమైన ఈ క్లబ్‌లో ప్రస్తుతం 877 మంది ఉన్నారు. వీరు కేవలం సేవా భావంతో పనిచేస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. నడక, ఆరోగ్యం, సేవా భావం వాకర్స్ క్లబ్ ప్రధాన ఆశయాలను తూచా తప్పకుండా 30 ఏళ్ల ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. వాకర్స్ పార్కును ఆదర్శంగా తీర్చిదిద్దడంతోపాటు ప్రజారోగ్యం కోసం నిరతంతర కృషి చేస్తోంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక అవార్డులు సాధించింది. ఒకే ఏడాది అత్యధికంగా 14 అవార్డులు సాధించి రికార్డులు సృష్టించింది.

అభివృద్ధిలో ముందంజ

క్లబ్‌తో పాటు వాకర్స్ పార్కు అభివృద్ధికి వీరు విశేష కృషి చేస్తున్నారు. ఎక్కడ చూసినా పచ్చదనంతో ఆహ్లాదంగా తీర్చిదిద్దారు. అరుదైన మొక్కలను పెంచుతున్నారు. క్లబ్ పూర్వ అధ్యక్షుడు నిమ్మగడ్డ బుచ్చయ్య, రాళ్లపల్లి సత్యనాథం, కేజీ కృష్ణారావు, సీహెచ్.కృష్ణమూర్తి ఎం.భాస్కర రావు, సత్తి సునీల్‌రెడ్డి, కె.ద్వారకానాథ్‌తోపాటు ప్రస్తుత అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఆధ్వర్యంలో క్లబ్ సేవా కార్యక్రమాలు విస్తృతమయ్యాయి. క్లబ్ ఆర్థిక అభివృద్ధిలో భాగంగా మూలనిధిని రూ.13లక్షలకు పెంచారు. పార్కులో సందర్శకులకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. కొత్తగా బోరు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది సుమారు 60 మంది నూతన సభ్యులను చేర్పించి మూల నిధికి రూ.3లక్షలు జమ చేశారు. 30 మంది ఎంజీఎఫ్ సభ్యులను చేర్పించడంతో పాటు వాకర్స్ ఫౌండేషన్‌కు రూ.3.50 లక్షలు, వాకర్స్ ఇంటర్నేషనల్ భవనానికి రూ.1లక్ష నిధులను విరాళంగా అందించారు. తుపాను బాధితులకు రూ.75వేలు సహాయంగా ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపించారు. గాంధీ విగ్రహంతోపాటు గాంధీ ప్రాంగణాన్ని ఏర్పాటుకు రూ.2లక్షలు నిధులను పల్లా చంద్రమౌళి సమకూర్చారు. ఎక్కడా లేని విధంగా క్లబ్ ఆధ్వర్యంలో గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారు. దీనికి అనుబంధంగా రీడింగ్ రూమును రాళ్లపల్లి సత్యనాథం నిర్మించారు.



మహాత్మా గాంధీ విగ్రహం



బుద్ధుడి ప్రాంగణం

రక్షణ చర్యలు

పార్కు రక్షణలో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షిస్తున్నారు. కలర్ లైటింగ్, స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యంలో భాగంగా ఆక్వా వాటర్ ప్యూరిఫైర్ ఏర్పాటు, క్లబ్‌కు డిజిటల్ చెల్లింపు సదుపాయం, మ్యూజిక్ సిస్టం వంటి ఆధునిక హంగులు సమకూర్చారు. సభా కార్యక్రమాలకు అనువుగా విశాలమైన సభా ప్రాంగణం నిర్మించారు.

సాంస్కృతిక కళలకు ప్రోత్సాహం: మన సంప్రదాయ కళలు, తెలుగు రంగస్థల నటులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా నాటకాలు, నాటికలు ఏర్పాటు చేసి నేటి తరానికి మన సాంస్కృతిక కళారూపాలను పరిచయం చేస్తున్నారు. నెలవారీ మెగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నారు. ఖరీదైన వైద్య పరీక్షలు ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నారు. ప్రముఖ వైద్యరంగ నిపుణులతో ప్రజలకు ఆరోగ్య సలహాలు, వైద్య పరీక్షలు అందించడం గమనార్హం. అంతే కాకుండా ప్రతిభావంతులను సత్కరించి వారికి మరింత ప్రోత్సహిస్తున్నారు.

అవార్డులు

వాకర్స్ ఇంటర్నేషనల్ స్థాయిలో ఐదు సార్లు ఉత్తమ క్లబ్ అవార్డులు సాధించింది. 2023లో ఏకంగా 14 అవార్డులు సాధించింది. ఉత్తమ క్లబ్, ఉత్తమ అధ్యక్షుడు (పల్లా చంద్రమౌళి), ఉత్తమ నగదు బహుమతి అవార్డు, ఉత్త సేవా పురస్కారం, ఉత్తమ ఎంజీఎఫ్ నమోదు వంటి అవార్డులు సాధించారు. పర్మినెంట్ రోలింగ్ షీల్డ్ సాధించడం అత్యంత అరుదైన విషయం.

పార్కులో మెరుగైన సౌకర్యాలకు ప్రాధాన్యం



పార్కులో సందర్శకులు, వాకర్స్‌కు అవసరమైన సదుపాయాలను మెరుగు పరిచేందుకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నాం. మూలనిధిని రూ.8 లక్షలనుంచి రూ.13 లక్షలకు చేర్చాం. రెండేళ్లలో 60మందిని చేర్పించాం. అంకితభావం కలిగిన సభ్యులను చేర్పించి క్లబ్ ప్రతిష్టను పెంచాం. ప్రతి నెలా కార్యవర్గం సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించి రానున్న కాలంలో నిర్వహించాల్సిన కార్యక్రమాలను నిర్ణయిస్తాం. ముఖ్యంగా పార్కుకు వచ్చే ప్రతి సందర్శకుడు ఆహ్లాదకంగా గడిపి సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో పని చేస్తున్నాం. దాతల సాయంతో గ్రంథాలయంలో ఏసీ సదుపాయం కల్పించాం.

–పల్లా చంద్రమౌళి, అధ్యక్షుడు

పచ్చదనం పెంపునకు చర్యలు



పార్కులో పచ్చదనం పెంపునకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. పూర్వ అధ్యక్షులు, సభ్యుల సహకారంతో పార్కు సుందరీకరణ చేశాం. కార్యక్రమాల నిర్వాణకు ప్రతి సభ్యుడు సహకరిస్తున్నారు. ఒకే సారి 14 అవార్డులు రావడానికి క్లబ్ సభ్యులు చేసిన కృషి కారణం. నిధుల వినియోగం అత్యంత పారదర్శకంగా జరుగుతుంది. అనాథ శరణాలలయాకు వెళ్లి వారికి కావాల్సినవి సమకూరుస్తున్నాం. నడక, ఆరోగ్యం పరిక్షణ ప్రాధాన్యతపై చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

–పి.వెల్చురాజు, కార్యదర్శి, వాకర్స్ క్లబ్

విజ్ఞానం.. వినోదం

మన ఉత్తరాంధ్ర తేజోమూర్తులైన అల్లూరి సీతారామరాజు, గిడుగు వేంకటరామ్మూర్తి, శ్రీశ్రీ, గురజాడ అప్పారావు, తెన్నేటి విశ్వనాథం, చిత్రాలను ఇక్కడ చూడవచ్చు. జాతిపిత మహాత్మాగాంధీ, బుద్ధ భగవానుడు విగ్రహాలు ఏర్పాటు చేశారు. వినోదానికి సంబంధించి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థులకు వ్యక్తిత్వం వికాస తరగతులు, ఇండోర్ గేమ్స్ ఉచిత శిక్షణ, యోగా తరగతులు ఉచితంగా నిర్వహిస్తున్నారు. శ్రావ్యమైన సంగీతాన్ని వినిపించేందుకు మ్యూజిక్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు.



ఇండోర్ గేమ్స్‌లో శిక్షణ



వాకర్స్ పార్కు ముఖ ద్వారం



వైద్య శిబిరం



ఉత్తరాంధ్ర తేజో మూర్తులు

వెటరన్ అథ్లెటిక్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న వెటరన్ అథ్లెటిక్ అసోసియేషన్ కొత్త కార్యవర్గం

సీతంపేట: వెటరన్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ విశాఖపట్నం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వాకర్స్ ఇంటర్నేషనల్ పీఆర్‌వో, అసోసియేషన్ న్యూ పేట్రన్ కమల్‌బైడ్ మాట్లాడుతూ ప్రతిభను చాటి పతకాలను సాధించిన మన అథ్లెట్స్ అంతర్జాతీయ క్రీడా వేదికపై విశాఖ కీర్తి పతాకాన్ని ఎరుగవేయాలన్నారు. అథ్లెట్ అసోసియేషన్ బలోపేతానికి ప్రత్యేక నిధి ఏర్పాటు చేసి క్రీడాకారులకు సహకారం అందిస్తామని తెలిపారు. జగద్గురు పీఠం డైరెక్టర్, అసోసియేషన్ న్యూ అడ్వైజర్ డాక్టర్ చింతలపాటి సత్యదేవ్ మాట్లాడుతూ సామాజిక సేవా సంస్థ జనకులం ఫౌండేషన్ ద్వారా ఔత్సాహిక క్రీడాకారులకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.రంగారావు, ఎస్‌వీఎస్‌ఎల్‌ఎస్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు నాగార్జున, సభా సమన్వయకర్త నందూరి రామకృష్ణ ఇన్స్టేషన్ అధికారిగా పాల్గొని సభ్యులచేత ప్రమాణ స్వీకారం చేయించారు.

నూతన కార్యవర్గం..

వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ విశాఖపట్నం నూతన చీఫ్ పేట్రన్‌గా కమల్‌బైడ్, చీఫ్ అడ్వైజర్‌గా డాక్టర్ చింతలపాటి సత్యదేవ్, పేట్రన్‌గా గోపిశెట్టి ఆదినారాయణ, లీగల్ అడ్వైజర్‌గా జె.పృథ్వీరాజ్, కోఆర్డినేటర్‌గా చింతలపాటి శ్రీనివాసరాజు, అధ్యక్షుడిగా ఇండియా మాస్టర్ అథ్లెటిక్స్ జనరల్ మంగ వరప్రసాద్, కార్యదర్శిగా ఎల్.వి.సుధాకర్, కోశాధికారిగా ఎం.రామారావు, పీఆర్‌వోగా వాకర్స్ ఇంటర్నేషనల్ చైర్మన్ వంశీ చింతలపాటి ప్రమాణ స్వీకారం చేశారు.

నిరుపయోగంగా ట్రాఫిక్ సిగ్నళ్లు



కంచరపాలెం కూడలిలో దిష్టిబొమ్మల్లా ట్రాఫిక్ సిగ్నళ్లు



ఊర్వశి జంక్షన్‌లో పనిచేయని సిగ్నళ్లు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ బీఆర్‌టీఎస్ రహదారి కూడలి నుంచి ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మర్రిపాలెం ప్రాంతాలకు వెళ్లే రహదారి కూడలిల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్నాయి. ఆరు నెల క్రితం వరకు పనిచేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రస్తుతం అలంకారప్రాయంగా మారాయి. సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ సిగ్నల్స్‌ను వినియోగంలోకి తేవాలని పలువురు వాహనాదారులు కోరుతున్నారు.

చెత్తకుప్పలమయం..



నక్కవానిపాలెంలో పేరుకుపోయిన చెత్త



తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా మాంసం దుకాణం వద్ద మురుగు నీరు

సీతమ్మధార: జీవీఎంసీ 14, 24 వార్డుల్లోని పలు ప్రాంతాలు చెత్తమయంగా మారాయి. ఏ వీధిలో చూసినా చెత్తకుప్పల దుర్వాసన వెదజల్లుతోందని స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. చెదురుముదురుగా వర్షాలు పడటం, పారిశుధ్యం లోపించడంతో ప్రజలు పలు రకాల సీజనల్ వ్యాధులతో అవస్థలు పడటం తెలిసిందే. సీతమ్మధార రైతుబజార్ చెంతనే చెత్తకుప్పలు పేరుకుపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. 24వ వార్డు నక్కవానిపాలెం రామాలయం రోడ్డులో, వివేకానంద కల్యాణ మండపం ఆవరణ, తాహసీల్దార్ కార్యాలయం ఎదురుగా గల రోడ్డులో మాంసం దుకాణం వద్ద కోళ్ల కడిగిన మురుగు నీరు ఉండిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు చెబుతున్నారు. పలు ప్రాంతాల్లో రోడ్ల పక్కనే చెత్త కుప్పలు పేరుకుపోతున్నా సకాలంలో తరలించడం లేదంటున్నారు. డంపర్ బిన్లు కూడా చెత్తతో నిండిపోవడంతో ప్రజలు వాటి పక్కనే చెత్త వేయాల్సి వస్తోంది. ఫలితంగా ఆ ప్రాంతాల్లో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు, పాదచారులు వాపోతున్నారు. పశువులు చేరి చెత్తను చెల్లాచెదురు చేస్తున్నాయని, సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుపరచాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవోపేతంగా అష్టోత్తర కలశాభిషేకం



పార్వతీ పరమేశ్వరులకు పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు నరసింహనగర్ శివారు గణేషనగర్‌లోని త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన దేవాలయంలో ఆదివారం అష్టోత్తర కలశాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకుడు ఏడిద గురునాథశర్మ ఆధ్వర్యంలో పార్వతీ పరమేశ్వరులకు కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కలశాల కొబ్బరికాయలు అమర్చి పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు టి.ఎస్.ఎన్.మూర్తి, కమిటీ సభ్యులు ప్రకాశరావు, నాయుడు, పైలా రమణ, భక్తులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ద్వారకా ఎస్‌ఐ వెంకటరావు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అల్లర్లు సృష్టించిన, రౌడియిజం చేసినా కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ వెంకటరావు హెచ్చరించారు. ఈ మేరకు ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. అలాగే వేలి ముద్రలతోపాటు సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు మద్యం షాపులు వద్ద తాగి అల్లరు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రస్తుతం యాక్టివ్‌గా ఉన్న వారిని హెచ్చరించారు. పద్ధతి మార్చుకోకపోతే అరెస్టు చేస్తామన్నారు.

అలరించిన వినోదాల విందు



కామెడీ స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ కళాకారులు ప్రదర్శించిన వినోదాల విందు కామెడీ స్కిట్ల కార్యక్రమం ఆద్యంతం నవ్వులు పంచింది. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కళాకారులు జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్ రాజు, భానుప్రకాష్, నాయుడు, పోర్టు శేషు, ఇమంది ఈశ్వరరావు, రామానుజం, శివజ్యోతి, సీత, వెంకటేశ్వరరావు కామెడీ స్కిట్లు ప్రదర్శించి నవ్వులు పంచారు. కనబడటం లేదు, కుర్చీని వదలడం లేదు, అప్పడాల కర్ర, సినిమా షూటింగ్, రంభ సూపర్ మార్కెట్, ధర్మం చెయ్యండి, సెల్‌ఫోన్ రిపేర్, తమ్ముళ్లతో తంటా, డాక్టర్ పేషెంట్, పతియే ప్రత్యక్ష దైవం, కాలు జారింది వంటి కామెడీ స్కిట్స్ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించాయి. ముందుగా ఇటీవల మరణించిన బాదంగీర్ సాయి ఆత్మశాంతికి రెండు నిమిషాల మౌనం పాటించారు. అతిథులు తిలక్ పట్నాయక్, సన్ మూర్తి, వి.వి.కృష్ణం రాజు చేతుల మీదుగా కళాకారులను సత్కరించారు.

ఎయిడ్స్ దీర్ఘకాలిక వ్యాధి మాత్రమే..



పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న డాక్టర్ కూటికుప్పల సూర్యారావు

కంచరపాలెం: ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పాటిస్తూ ఆదివారం 'హైలీ యాక్టివ్ యాంటీ రిట్రోవైరల్ థెరపీ(హార్ట్) సదస్సును కంచరపాలెం డాక్టర్ కూటికుప్పల ఆసుపత్రిలో నిర్వహించారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ కూటికుప్పల సూర్యారావు సదస్సును ప్రారంభించి మాట్లాడారు. గత పాతికేళ్ల క్రితం ఎయిడ్స్ సోకిన వ్యక్తులు రెండేళ్లలోనే అత్యంత దయనీయంగా మరణించేవారని, నేడు ఎయిడ్స్ ఒక దీర్ఘకాలిక వ్యాధి మాత్రమేనని, ఎయిడ్స్ సోకిన వ్యక్తిని 72 గంటలలోపు పోస్టు ఎక్స్‌పోజర్ ప్రొఫలాక్సిస్ మందులు వాడితే నెగిటివ్ వచ్చేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. అనంతరం బీపీ, షుగర్, ఈసీజీ, స్త్రీ సంబంధిత పరీక్షలు నిర్వహించారు. మహిళలకు, వృద్ధులకు, దివ్యాంగులకు పౌష్టికాహార కిట్లను డాక్టర్ కూటికుప్పల సూర్యారావు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ గైనికాలజిస్టు డాక్టర్ సుభాదేవి, డాక్టర్ లక్ష్మికొండమ్మ, బోన్ స్పెషలిస్ట్ డాక్టర్ అచ్యుతరావు, రోబొటిక్ లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ కవిత, కాస్మోలజిస్ట్ డాక్టర్ మధుకర్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రుషికొండ భవనాలు వినియోగంలోకి తీసుకురావాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

సీతమ్మధార: రుషికొండ భవనాల వినియోగంపై ఆదివారం విశాఖ పౌర గ్రంథాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కన్వీనర్ నరవ ప్రకాశ రావు మాట్లాడుతూ ఇటీవల విశాఖ వచ్చిన ముఖ్యమంత్రి రుషికొండ భవనాలు తిలకించారని, వీటి వినయోగంపై ప్రజల అభిప్రయాలు, సూచనలు తెలియజేయాలని కోరిన నేపథ్యంలో ఈ రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఆచార్య వి.బాలమోహన్ దాస్, ఆచార్య ఎం.ముత్యాలనాయుడు, మాజీ శాసన మండలి సభ్యులు ఎం.వి.ఎస్.శర్మ, మంత్రి శ్యాంప్రసాద్, కల్నల్ సుబ్బారావు, కెప్టెన్ కె.ఎస్. నాయుడు, జయశ్రీ , సోహన్ హట్టంగాడి , సీనియర్ జర్నలిస్ట్ ఎస్.శివశంకర్, కొత్తపల్లి వెంకట రమణ, డాక్టర్ సీతల్, మేడా మస్తాన్ రెడ్డి, వివిధ బౌద్ధ సంఘాల ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేశారు. తక్షణం భవనాలను ప్రజలు తిలకించేందుకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. నిర్మించిన భవనాలు వినియోగంలోకి తీసుకురాకపోవడం సరికాదన్నారు. ప్రజాధనంతో కట్టిన భవనాలను ప్రజలకే ఉపయోగపడాలని తెలిపారు. నగరంలోని ఉన్న మ్యూజియంలన్నీ ఇక్కడే ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

పోలి పాడ్యమికి ఏర్పాట్లు

సీతంపేట: పరమశివునికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీక మాసం ఆదివారం అమావాస్యతో ముగిసింది. నెల రోజుల పాటు భూలోకంలో విహరించిన శంభోశంకరునికి కార్తీక దీపాలతో వీడ్కోలు పలికేందుకు భక్తులు సిద్ధమయ్యారు. సోమవారం పోలి పాడ్యమి పర్వదినాన్ని పురస్కరించుకొని సూర్యోదయానికి ముందు నీటిలో దీపాలను వదిలి పార్వతీపతిని కైలాసానికి సాగనంపుతారు. దీని కోసం దేవాదాయ శాఖ పరిధిలో గల శివాలయాలలో భక్తులు దీపాలను వదలడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్థానిక గణేష్‌నగర్‌లో గల పార్వతీశ్వరాలయం, రామకృష్ణానగర్ రామలింగేశ్వరాలయంలో కృత్రిమ కొలనులు నిర్మించారు. ఒకేసారి 30 మంది భక్తులు దీపాలు నీటిలో వదిలే ఏర్పాటు చేశారు. సోమవారం వేకువజాము నాలుగు గంటల నుంచి దీపాలు వదిలేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అర్చకులు గంగవరపు శివాజీ శర్మ , భాస్కరశర్మ , నాగ కామేశ్వరశర్మ తెలిపారు.